క్లుప్తంగా

వ్యర్థాలతో అవస్థలు



తెనాలిఅర్బన్: సాలిపేటలోని అర్బన్ హెల్త్ సెంటర్ వద్ద వ్యర్థాల గుట్ట దర్శనమిస్తోంది. ఇక్కడ చెత్తను వేసి పదిరోజులు దాటిన ఇప్పటి వరకు మున్సిపల్ సిబ్బంది తొలగించలేదని స్థానికులు తెలిపారు. దీనివల్ల దుర్వాసన వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైన మున్సిపల్ అధికారులు స్పందించి వెంటనే దానిని తొలగించాలని వారు కోరుతున్నారు.

బైబిల్ పఠనంపై ఆసక్తి పెంపొందించుకోండి



తెనాలిఅర్బన్: బైబిల్ పఠనంపై చిన్నారులు ఆసక్తిని పెంపొందించుకోవాలని జీసస్ కాల్స్ మినిస్ట్రీస్ తెనాలి ప్రతినిధి కాంద్రు ప్రకాష్ పేర్కొన్నారు. జీసస్ కాల్స్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో చెంచుపేటలోని ప్రెయర్ టవర్‌లో జరుగుతున్న డైనమిక్ కిడ్స్ క్యాంప్ బుధవారం కొనసాగింది. చిన్నారులకు బైబిల్ వాఖ్యాల కంఠస్థం, క్రైస్తవ పాటలు, సంగీతం వంటి పోటీలను నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారంతో క్యాంప్ ముగుస్తుందని చెప్పారు. కార్యక్రమంలో టీచర్స్ సిహెచ్ శాంత కుమారి, ఎస్ పెర్సిస్ సౌందర్య రాణి తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

తెనాలిఅర్బన్: జిల్లా పరిధిలోని ప్రభుత్వ, ప్రవేట్ ఐటీఐ కళాశాలలో చేరదలచిన విద్యార్థులు ఈనెల 24వ తేదీలోపు ఆన్‌లైన్‌లోగాని, తెనాలి, గుంటూరులలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో ఏర్పాటు చేసిన నమోదు కేంద్రాలలో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కన్వీనర్, తెనాలి ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ రావి చిన్న వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు నమోదు కేంద్రాలలో తప్పని సరిగా సర్టిఫికెట్‌లు వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. వెరిఫికేషన్ చేయించుకున్న విద్యార్థులు జూన్ రెండు నుంచి 10వ తేదిలోపు తెనాలి ఐటీఐ కళాశాలలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని పేర్కొన్నారు. వివరాలకు సెల్ నెంబర్.9347 795839, 6304572793, 9014491772లలో గాని, తెనాలి ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో సంప్రదించవచ్చన్నారు.

శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోండి



తెనాలిఅర్బన్: వేసవి శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ ఎస్. లావణ్య సుధ పేర్కొన్నారు. నెహ్రూరోడ్డులోని జిల్లా గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ తరగతులు బుధవారం కొనసాగాయి. విద్యార్థులకు నీతి కథలు, మహనీయుల జీవిత విశేషాలు, పుస్తక పఠనం, తెలుగు గ్రామర్, పద్యాలు, కథలు వంటి వాటిని నేర్పించారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు తరగతులు జరుగుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో పలువురు విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దుస్తులు పంపిణీ



తెనాలిఅర్బన్: శ్రీఆంజనేయం ధ్యాన యోగ మండలి వ్యవస్థాపకులు కిషోర్ గురూజీ పుట్టినరోజును పురస్కరించుకుని వారి శిష్యుల ఆధ్వర్యంలో పట్టణంలోని నిరాశ్రయులకు బుధ వారం నూతన వస్త్రాలు, అల్పాహారంను తెనాలి 2వ జూనియర్ సివిల్ జడ్జి రాజశేఖర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో యోగ మండలి సభ్యులు తాడికొండ శ్రీనివాసరావు, నాగరాజు, ముంత శ్రీనివాసరావు, కోమలదేవి, సూర్యానారాయణ, రాంబాబు, సుబ్బారావు, గోదావరి సత్యనారాయణ, రేఖ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు ఈత శిక్షణ

తాడేపల్లి రూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని కృష్ణానది కరకట్ట వెంబడి ఉన్న ఆక్వాడెవిల్స్ వెల్ఫేర్ అసోషియేషన్ ఆధ్వర్యంలో చిన్నారులకు ఈత శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు అసోషియేషన్ కార్యదర్శి రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6 నుంచి 14 ఏళ్ల వయసు గల చిన్నారులకు మే 4వ తేదీ నుంచి 25వ తేదీ వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. రోజూ ఉదయం 5.30 గంటల నుంచి 8.30 గంటల వరకు ఈత శిక్షణ ఉంటుందని.. ఔత్సాహికులు 79810 33007 నంబరులో సంప్రదించాలన్నారు.

స్టాండింగ్ కౌన్సిల్‌పై రచ్చ



అభ్యంతరం చెబుతున్న టీడీపీ కౌన్సిలర్లు



ఆగ్రహం వ్యక్తం చేస్తున్న చైర్‌పర్సన్ రాధిక



చైర్‌పర్సన్‌కు బొకే ఇస్తున్న స్టాండింగ్ కౌన్సిల్ హరిదాసు నళిని

- అంశాన్ని వాయిదా వేయాలంటూ టీడీపీ కౌన్సిలర్ల పట్టు
- ఏకగ్రీవంగా ఆమోదిస్తున్నట్లు ప్రకటించిన చైర్‌పర్సన్

తెనాలిటౌన్: మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా ఎవరిని ఎన్నుకోవాలనే అంశంపై కౌన్సిల్‌లో గలాభా జరిగింది. అసలు ఆ అంశాన్నే వాయిదా వేయాలంటూ టీడీపీ కౌన్సిలర్లు పట్టుబట్టారు.ఏకగ్రీవంగా ఆమోదిస్తున్నట్లు చైర్‌పర్సన్ ప్రకటించి పోడియం దిగివెళ్లారు. దీనిపై టీడీపీ కౌన్సిలర్లు కొద్దిసేపు నిరసన వ్యక్తంచేశారు. చైర్మన్ చాంబర్‌కు వెళ్లి డీసెంట్ ఇచ్చారు. పట్టణ మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం బుధవారం మధ్యాహ్నం 11.30 గంటలకు ప్రారంభమైంది. చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షత వహించారు. మొత్తం అజెండాల్లో 39 అంశాలను చేర్చారు. వీటిల్లో అధికశాతం పట్టణంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించినవే ఉన్నాయి. 3, 11, 22 వార్డులకు సంబంధించిన అభివృద్ధి పనులకు సింగిల్ టెండర్లపై నిర్ణయం కోరుతూ, అజెండాలో 2,3,5 అంశాలపై చర్చ జరిగినపుడు టీడీపీ కౌన్సిలర్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సింగిల్ టెండర్లను పరిగణనలోకి తీసుకోవద్దని గత ఆరునెలలుగా చెబుతున్నా, అజెండాలోకి ఎలా తీసుకొస్తున్నారని టీడీపీ కౌన్సిలరు పసుపులేటి త్రిమూర్తి ప్రశ్నించారు. దీనిపై ఆయా వార్డుల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు ఆవుల కోటయ్య, కఠారి రత్నకుమారి అభ్యంతరం చెప్పారు. తమ వార్డుల్లో పనులు చేపట్టేందుకు ఎవరూ ముందుకు రావటం లేదని, అభివృద్ధి పనుల్లో జాప్యం జరుగుతున్నందున, ఎవరో ఒకరు వచ్చినప్పుడు పనులు చేయించాలి కదా? అంటూ రత్నకుమారి, ఆవుల కోటయ్య ప్రశ్నించారు.

బిల్లులివ్వకపోతే పనులెవరు చేస్తారు?

వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ పేరం సంజీవరెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించటం లేదనీ, అలాంటప్పుడు పనులు చేసేందుకు ఎవరు ముందుకొస్తారని ప్రశ్నించారు. సకాలంలో బిల్లులు చెల్లిస్తే సింగిల్ టెండరుకు అవకాశం ఉండదన్నారు. సింగిల్ టెండరును అజెండాలో చేర్చాల్సిన కారణాన్ని, నిబంధననూ మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న వివరణనిచ్చారు. అయినాసరే, వాటిని రద్దు చేయాల్సిందేనని టీడీపీ కౌన్సిలర్లు పట్టుబట్టారు. దీనితో ఆయా టెండర్లను రద్దుచేస్తున్నట్లు చైర్‌పర్సన్ రాధిక ప్రకటించారు. తమ వార్డులో అభివృద్ధి పనులు లేవని వైఎస్సార్‌సీపీ కౌన్సిలరు షేక్ ఇస్మాయిల్ వాపోయారు. అజెండాలోనూ చేర్చకపోవటాన్ని ప్రశ్నించారు. వార్డుల్లో కుక్కల బెడదపై వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు ప్రత్యేకంగా సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. వచ్చే వారం నుంచి పట్టణంలో కుక్కల నియంత్రణకు అవసరమైన చర్యలు చేపడతామని కమిషనర్ బండి శేషన్న వివరణనిచ్చారు.

స్టాండింగ్ కౌన్సిల్ విషయమై...

అనంతరం మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ ఎంపికపై గల 33వ అంశం చర్చకు వచ్చింది. స్టాండింగ్ కౌన్సిల్‌గా హరిదాసు నళిని, తాడిబోయిన బుచ్చిరాజు, దేవరపల్లి మల్లికార్జునరెడ్డి, తాడిశెట్టి వెంకటేశ్వరరావు పేర్లను అజెండాలో చేర్చారు. ఈ అంశంపై చర్చ రాగానే 11వ వార్డు కౌన్సిలరు కఠారి రత్నకుమారి లేచి, హరిదాసు నళిని పేరును ప్రతిపాదిస్తున్నట్టు చెప్పారు. టీడీపీ కౌన్సిలర్లు పసుపులేటి త్రిమూర్తి, దేసు యుగంధర్, అడుసుమల్లి వెంకటేశ్వరరావు లేచి ఈ అంశాన్ని వాయిదా వేయాలని కోరారు. ఒక మహిళా న్యాయవాదిని ఏకాభిప్రాయంగా తీసుకోవాలని అంతా భావిస్తున్నారు... అలాంటప్పుడు ఎందుకు వాయిదా వేయాలంటూ చైర్‌పర్సన్ రాధిక ప్రశ్నించారు. ఇది కూటమి ప్రభుత్వానికి సంబంధించిన అంశం ఇది. ఆలపాటి రాజాకు దృష్టికి తీసుకెళ్లి నిర్ణయం తీసుకోవాలి. ఆయన అందుబాటులో లేనందున వాయిదా వేస్తే, వచ్చే కౌన్సిల్‌లో మాట్లాడుకోవచ్చు...అని త్రిమూర్తి బదులిచ్చారు. దీనిపై చైర్‌పర్సన్, త్రిమూర్తికి కొద్దిసేపు వాగ్వాదం జరిగింది.

వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ మొగల్ అహ్మద్‌బేగ్ మాట్లాడుతూ స్టాండింగ్ కౌన్సిల్‌గా పార్టీకి చెందిన వారిని రెన్యువల్ చేయాల్సిన ఆవశ్యకతను ప్రస్తావించారు. ఈ వాదన ఇలా జరుగుతుండగానే అన్ని అంశాలను ఆమోదిస్తున్నట్టు చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక ప్రకటించి, పోడియం దిగి వెళ్లిపోయారు. ఇందుకు టీడీపీ కౌన్సిలర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. డీసెంట్ నోట్ ఇస్తామని ప్రకటించారు. దీంతో సమావేశం ముగిసింది. మున్సిపల్ వైస్‌చైర్మన్లు మాలేపాటి హరిప్రసాద్, అత్తోట నాగవేణి, కో-ఆప్షన్ సభ్యులు బచ్చనబోయిన శ్రీనివాసరావు, పెచ్చింగ్ సుభాని, ఇతర కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారంపై గరం..గరం



మాట్లాడుతున్న ఆలయ పాలకవర్గ నేతలు

- శ్రీవాసవీ దేవాలయానికి స్వయం ప్రకటిత పాలకవర్గం చెల్లదు
- చెట్టుకింద కూర్చొని పేర్లు రాసుకుంటే ఎలా?
- ప్రమాణస్వీకారం ఎలా చేస్తారు ?
- సర్వసభ్య సమావేశంలో ఏ నిర్ణయమైనా సమ్మతమే!
- దేవస్థానం కమిటీ పాలకవర్గ నేతల వెల్లడి

తెనాలి: ''సభ్యుల ఎదుట జమా ఖర్చులు చదవకుండా, తీర్మానం చేయకుండా చెట్టుకింద కూర్చొని రాసుకున్న కమిటీ ఎలా చెల్లుతుంది?ప్రమాణ స్వీకారం ఎలా చేస్తారు? ఇప్పటికైనా మాకు వివాదం అవసరం లేదు. సర్వసభ్య సమావేశానికి హాజరుకండి.చక్కని వాతావరణంలో చర్చించుకుని ఏ నిర్ణయం తీసుకున్నా వాసవీ అమ్మవారి సాక్షిగా కట్టుబడి ఉంటా'మని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం కమిటీ పాలకవర్గం నేతలు ప్రకటించారు. పట్టణ బోసు రోడ్డులోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం కమిటీ వివాదం నేపథ్యంలో స్వయం ప్రకటిత కమిటీ బుధవారం సాయంత్రం ప్రమాణ స్వీకారోత్సవానికి సన్నాహాలు చేస్తున్న నేపథ్యంలో ప్రస్తుత కమిటీ నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కమిటీకి స్వయంప్రకటిత పాలకవర్గం చెల్లదని ఉపాధ్యక్షుడు ఆకి అచ్యుతరావు స్పష్టం చేశారు. వుప్పల వరదరాజులు మాట్లాడుతూ దేవస్థానాన్ని ఎంతో అభివృద్ధి చేసిన అధ్యక్షుడు నూకల వెంకట వేణుగోపాలరావు అనారోగ్యరీత్యా అమెరికాలో చికిత్స పొందుతున్నారని చెప్పారు. 4న జరిగే సర్వసభ్య సమావేశంలో ఏకాభిప్రాయంతో వెళ్లాలని సూచించినట్టు తెలిపారు. అయినప్పటికీ స్వయం ప్రకటిత కమిటీ ప్రమాణ స్వీకారం పేరిట హడావుడి చర్యలను సభ్యసమాజం గర్హిస్తోందని, ఎవరూ ఎన్నుకోకుండా చెట్టుకింద రాసుకుంటే సరిపోదన్నారు. ఏ రాజకీయ నాయకుడూ దీన్ని సమర్థించరని అన్నారు. వైశ్యుల సత్రాలు, దేవాలయాలపై ప్రభుత్వ పర్యవేక్షణ లేకుండా మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య చూశారని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం శ్రీవాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించటంపై ఆర్యవైశ్యులు అందరూ సంతోషిస్తున్నారని గుర్తుచేశారు. వాసవీ దేవస్థానంలో విభేదాలు, ఉద్రిక్తతలు సమంజసం కాదన్నారు. దేసు శ్రీనివాసరావు మాట్లాడుతూ స్వయం ప్రకటిత కమిటీ అధ్యక్షుడు పెండేల వెంకట్రావు 2002-2024లో చేసిన అభ్యర్థనతోనే ఆలయ కమిటీలో సామరస్యం కోసం నూకల వేణుగోపాలరావు వచ్చారని గుర్తుచేశారు. అప్పట్లో శిథిల భవనం ఉండేదని, అమ్మవారికి ఊరేగింపులో ఛత్రం కూడా ఉండేది కాదని తెలిపారు. నూకల వేణు అధ్యక్ష బాధ్యతలు చేపట్టగానే చెన్నై నుంచి తెప్పించారని చెప్పారు. ఉర్దూ స్కూలు ఎదురుగా పెంకుటి దుకాణాలను తొలగించి, అక్కడ కాంప్లెక్సును నూకల వేణు సొంత ఖర్చులతో నిర్మించారని వివరించారు.దాతల విరాళాలతో దేవస్థానంలో నాలుగు కల్యాణ మండపాలు, సత్యనారాయణస్వామి ఆలయాన్ని నిర్మించారని వివరించారు. ఎవరి హయాంలో అభివృద్ధి జరిగిందో చూడాలని కోరారు. స్వయం ప్రకటిత కమిటీలో సభ్యత్వం లేనివాళ్లు కూడా ఉన్నారని మద్దాళి శేషాచలం అన్నారు. ఆర్యవైశ్య నాయకులు మాలేపాటి హరిప్రసాద్, గొడవర్తి సాయిహరేరామ్, కొణిజేటి శంకరరావు, అన్నవరపు నరసింహారావు, అత్తలూరి నరసింహారావు, గోపు రామకృష్ణ, చుండూరు వెంకటేశ్వరరావు, కొల్లా గురునాథగుప్త, చుండూరు సాయి, నూకల భాస్కర్ పాల్గొన్నారు.

15 నుంచి క్రికెట్ పోటీలు



తెనాలిరూరల్: తెనాలి ఎస్‌వీఆర్ ఇంజినీరింగ్ కళాశాలావరణలో ఈ నెల 15వ తేదీ నుండి కేవైఆర్ అండ్ కేబీఎస్ క్రికెట్ లీగ్ పోటీలు నర్వహించనున్నారు. పోటీల బ్రోచర్‌ను ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బీటీ నాయుడు, మహ్మద్ ఖుద్దూస్, పసుపులేటి త్రిమూర్తి, కృష్ణ బలిజ సంఘం అధ్యక్షుడు కావేటి వేణుగోపాల్, కౌన్సిలర్ అన్నం పిన్నరావు, పట్టెం హరిబాబు, కోలా రాంమూర్తి, బత్తుల నరసింహరావు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



తెనాలి: శ్రీవెంకటేశ్వర యోగ సేవ కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక రైల్వేస్టేషను వద్ద పేదలకు అన్నదానం, పండ్ల పంపిణీ చేశారు. యోగ సభ్యులు చిటుమడుగుల సురేష్‌బాబు వర్ధంతి సందర్భంగా భార్య చిటుమడుగుల శివలక్ష్మి, కుమారులు చిటుమడుగుల చైతన్య, చిటుమడుగుల మోహన్ సహకారంతో ఈ సేవ కార్యక్రమాన్ని చేశారు. ఎస్‌వీ యోగా కన్వీనర్ ముద్దా భక్తుని రమణయ్య పర్యవేక్షించారు. శ్రీశివలింగేశ్వర భక్తసేవాసమితి అధ్యక్షుడు కుర్రా శ్రీను, సభ్యులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మే డే

మంగళగిరి: నగర పరిధిలోని ఆత్మకూరు జాతీయ రహదారి వెంట ఉన్న నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం మే డే నిర్వహించనున్నట్లు పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకురాతి రాజేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే మే డే కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మాజీ ఆప్కో ఛైర్మన్ చిల్లపల్లి మోహనరావులు పాల్గొంటారని అన్నారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ప్రజ్ఞాచారికి జాతీయ సాహితీ పురస్కారం



ప్రజ్ఞాచారికి పురస్కారం ప్రదానం చేస్తున్న దృశ్యం

తెనాలి: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఎమ్మెల్యే నీతిపూడి గణపతిరావు స్మారక సేవా జాతీయ సాహితీ పురస్కారాన్ని రూరల్ మండలం కొలకలూరు గ్రామానికి చెందిన 'సాహితీ రత్న' నూతక్కి పూర్ణప్రజ్ఞాచారి అందుకున్నారు. కోనసీమ జిల్లా పి.గన్నవరంకు చెందిన మమత స్వచ్ఛంద సేవా సమితి ఆధ్వర్యంలో ఆ గ్రామంలోని బుధవారం భీమా వెంకటేశ్వర కాంప్లెక్స్ ఆవరణలో ఏర్పాటు చేసిన వేదికపై ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. స్థానిక ఎమ్మెల్యే గిడ్డు సత్యనారాయణ, న్యాయవాది నీతిపూడి గణపతిరావు, మమత స్వచ్ఛంద సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, కోరుకొండ జాను, కోట మోహన్‌రావు, వీపీఎస్ బొంతు గణపతిరావు చేతులమీదుగా ఈ గౌరవాన్ని అందజేశారు. ప్రజ్ఞాచారి మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన నీతిపూడి గణపతిరావు స్మారక జాతీయ సాహితీ పురస్కారం అందుకోవటం సంతోషంగా ఉందన్నారు.

స్పెల్లింగ్ మాస్టర్‌కు ఘన స్వాగతం



హార్దీకి స్వాగతం పలుకుతున్న బీజేఆర్ కమిటీ సభ్యులు

తెనాలిరూరల్: మాస్టర్ స్పెల్లర్స్ డాట్ కాం ఆధ్వర్యంలో ఏప్రిల్ 28వ తేదీన గుజరాత్‌లోని వడోదరలో జరిగిన జాతీయ స్థాయి స్పెల్లింగ్‌కాంపిటీషన్‌లో పట్టణానికి చెందిన బాలుడు అత్తోట హార్దీ మాస్టర్ స్పెల్లర్స్ అవార్డు గెలుపొందాడు. మంగళవారం రాత్రి తెనాలి చేరుకున్న హార్దీకి బాబు జగ్జీవన్ రామ్ (బీజేఆర్) కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారాఉ. రేప్వే స్టేషనుకు చేరుకుని హార్దీకి పూలమాలలతో స్వాగతం పలికారు. పట్టణ ఐతానగర్‌లోని మాజీ కౌన్సిలర్ అత్తోట వందనం మనుమడు హార్దీ. కొల్లూరులోని ఫో ఫ్రంట్ స్కూల్లో ఐదో తరగతి చదువుతున్నాడు. డిసెంబరులో జరిగిన రాష్ట్ర స్థాయి అబాకస్ పోటీల్లో విజేతగా నిలిచాడు. బాలుడికి స్వాగతం పలికిన వారిలో కమిటీ అధ్యక్షుడు మేకల సురేష్, సిద్దెల కమలాకర్, నలుకుర్తి రమేష్, అత్తోట శరత్, పొన్నెగంటి రమేష్, తెనాలి జయప్రకాష్, అత్తోట శాయమ్, బొంతా సుధీర్, చొప్పర దిలీప్ ఉన్నారు.

ప్రశాంతంగా పాలిటెక్నిక్ ప్రవేశపరీక్ష



కేటాయించిన గదులను చూసుకుంటున్న విద్యార్థులు

తెనాలి: రాష్ట్ర ప్రభుత్వం పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికి బుధవారం నిర్వహించిన ప్రవేశపరీక్ష తెనాలిలో ప్రశాంతంగా జరిగింది. పట్టణ కొత్తపేటలోని దొడ్డపనేని ఇందిర మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాల, రావి సాంబయ్య మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాల, బోసురోడ్డులోని అంబేడ్కర్ కాలేజిలను పరీక్షా కేంద్రాలుగా ఏర్పటుచేశారు. ఆయా పరీక్షా కేంద్రాల్లో దాదాపు 600 మంది విద్యార్థినీ విద్యార్థులు పరీక్షలు రాయగా, 60 మంది వరకు గైర్హాజరైనట్టు సమాచారం. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు.

నిర్మాణ దశలో కల్వర్టు!



పూర్తికాని కల్వర్టు నిర్మాణం

తాడేపల్లి రూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని ఎప్పటి నుంచో ఉన్న మురుగునీటి సమస్యను పరిష్కరించేందుకు అధికారులు కల్వర్టు నిర్మాణ పనులు చేపట్టారు. ప్రజలందరూ సంతోషం వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యంతో ఆ సంతోషం నీటి మీద బుడగలా మారింది. 5 నెలల క్రితం చిర్రావూరులో గంగాలమ్మ గుడి వద్ద రేపల్లె కరకట్ట ఎక్కే మార్గంలో కల్వర్టు నిర్మాణ పనులు చేపట్టారు. పనులు చేపట్టి 5 నెలలు అవుతున్నా.. పనులు పూర్తి కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ గ్రామంలో మూడు వైపులా పంట పొలాలు, మురుగునీరు, గ్రామాలలోని మురుగు నీరు, ఈ కరకట్ట వెంబడి ప్రవహించాలి. వర్షాకాలం వస్తే మురుగు నీరు వెళ్లే మార్గం లేక పంట పొలాల్లో నీరు నిలిచి పంటలు పాడైపోతున్నాయి.

చర్యలు తీసుకోవాలి..

కల్వర్టు నిర్మాణం పూర్తికాకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ ప్రజలు అధిక సంఖ్యలో పాడి పోషణపై ఆధారపడి జీవిస్తున్నారు. లంక పొలాలకు పశువులను తోలుకు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉందని.. అధికారులు చర్యలు తీసుకుని వెంటనే కల్వర్టు నిర్మాణం పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

సంపదలను విదేశీయులకు దోచిపెట్టేందుకు కుట్ర!



మాట్లాడుతున్న పచ్చల శ్యాంబాబు

మంగళగిరి: ఖనిజ సంపదలను విదేశీయులకు దోచిపెట్టేందుకే మావోయిస్టులపై కేంద్ర ప్రభుత్వం దాడులు చేస్తుందని న్యాయవాది పచ్చల శ్యాంబాబు విమర్శించారు. పట్టణంలోని ఐ.బి.ఎన్ ప్రెస్‌క్లబ్ భవన్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారతదేశంలో ప్రశ్నించే వారిని లేకుండా అంతమొందించాలనే కుట్ర జరుగుతుందన్నారు. ఝార్ఖండ్, ఛత్తీస్‌ఘడ్ అడవులలోని ఖనిజ సంపదలను దోచిపెట్టేందుకు ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షాలు మావోయిస్టులపై దాడులు చేయిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ, ఛత్తీస్‌ఘడ్ పరిధి కర్రెగుట్టల వద్ద 38 మావోయిస్టులకు హత మార్చారన్నారు. అన్యాయాన్ని నిలదీసి ప్రశ్నించే వారే మావోయిస్టులన్నారు. మావోయిస్టుల అజెండాను అమలు చేస్తామని తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మావోయిస్టులను చర్చలకు ఆహ్వానించారన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి మావోయిస్టులను చర్చలకు ఆహ్వానించారన్నారు. మావోయిస్టులు కూడా భారతీయులేనని గుర్తించి వారితో శాంతిపూర్వక చర్యలు నిర్వహించాలని కోరారు.

ప్రభుత్వం కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



దీక్షలో పాల్గొన్న కార్మికులు

తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు తమకు రావాల్సిన బకాయిల కోసం చేస్తున్న దీక్ష బుధవారం 146వ రోజుకు చేరుకుంది. కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ.. ఫ్యాక్టరీ కార్మికుల విషయం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం సమంజసం కాదన్నారు. సమస్యలను పరిష్కరిస్తామని చెప్తూ కాలయాపన చేస్తున్నారన్నారు. దీక్షలో సీహెచ్ పిచ్చయ్య, ఎం.డి ఇస్మాయిల్, ఎం.గురవయ్య, వై.సాంబశివరావు, కె.ఆదినారాయణలు మద్దతు తెలిపారు. సంఘం నాయకులు ఎం.ఆశీర్వాదం, బి.సూర్యప్రకాశరావు, వై.వెహోషువ, వై.రమాదేవి, ఇ.సారమ్మ తదితరులు పాల్గొన్నారు.

నిర్మల ఫార్మశీలో ప్రాంగణ ఎంపికలు



విద్యార్థులకు కళాశాల సెక్రటరీ సిస్టర్ నిర్మల జ్యోతి అభినందనలు తెలిపారు.

ఆత్మకూరు(మంగళగిరి): మండలంలోని ఆత్మకూరు నిర్మల ఫార్మశీ కళాశాలలో బుధవారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. దేశీయ ఫార్మశీ సంస్థ హెటిరో సంస్థ నిర్వహించిన ఎంపికల్లో వివిధ ఫార్మశీ కళాశాలల నుంచి 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వారిలో 128 విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ బి.పాములరెడ్డి తెలిపారు. ఎంపికైన

పారిశ్రామిక వేత్తకు అవార్డు



యర్రబాలెం(మంగళగిరి): నగర పరిధిలోని యర్రబాలెం పారిశ్రామిక వాడకు చెందిన పారిశ్రామిక వేత్త సరికొండ రామరాజు 'బెస్ట్ బిజినెస్ మ్యాన్' అవార్డు అందుకున్నారు. ప్రెస్ క్లబ్ వెల్ఫేర్ వరల్డ్ వైడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివిధ రంగాలలో ప్రతిభ కనబరచిన 40 మంది ప్రముఖులకు బుధవారం విశాఖపట్నం లైబ్రరీ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో అవార్డులు అందజేశారు. అందులో భాగంగా సరికొండ రామారాజు ఫౌండేషన్ జనరల్ సెక్రటరీ ఔకట్‌కుమార్, అనన్య సాయి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. రామరాజును పారిశ్రామిక వాడకు చెందిన పలువురు పారిశ్రామిక వేత్తలు అభినందించారు.

బాల్యవివాహాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత

రేపల్లె: బాల్య వివాహాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అని బాలిక సంరక్షణ జిల్లా అధికారి జి.కృష్ణ చెప్పారు. మండలంలోని పేటేరు భావన్నారాయణస్వామి ఆలయంలో గ్రామ కమిటీ సభ్యులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలను గ్రామీణులకు తెలియపరచాలన్నారు. యువతికి 18, యువకునికి 21 సంవత్సరాలు నిండిన తర్వాతనే వివాహాలు చేయాలని చెప్పారు. బాల్య వివాహాలు జరిపినా, ప్రోత్సహించిన చట్టరీత్యా నేరమన్నారు. అట్టివారికి రూ.లక్ష జరిమానా రెండు సంవత్సరాల జైలు శిక్ష పడుతుందని తెలియజేశారు. పలు అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో సీడీపీవో సుచిత్ర, అంగన్‌వాడీలు, ఆశాలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పిల్లల ఎదుగుదలకు వీబీఎస్ దోహదం



తాడేపల్లి రూరల్: పిల్లలు చిన్నతనం నుంచే ఆధ్యాత్మికత ఎదుగుదలకు విరామ బైబిల్ పాఠశాల(వీబీసీ) దోహదపడుతుందని నూతన యేరూషలేము ప్రార్థనా మందిరంగ దైవసేవకులు ఐజాక్ చార్లెస్ అన్నారు. ఉండవల్లి నూతన యేరుషలేము ప్రార్థనామందిరంలో జరుగుతున్న వీబీసీ కార్యక్రమం బుధవారం ముగిసింది. ముగింపు సందర్భంగా ఉండవల్లి పల్లె, లొద్ది, అమరారెడ్డి నగర్, అంబేడ్కర్ కాలనీలో పిల్లలు ప్రత్యేకంగా కిరీటాలు ధరించి ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పప్పెట్‌షో ఆకట్టుకుంది. కార్యక్రమంలో పలువురు సంఘ పెద్దలు, పాస్టర్లు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
90102 23706 (తెనాలి, వేమూరు, రేపల్లె)
99122 25447 (తెనాలి)
Office mail : sakshigntadvt@gmail.com